# సుందరయ్య ఆత్మకథ



ప్రజాశక్తి బుక్‌హౌస్

# పుచ్చలపల్లి సుందరయ్య

# ఆత్మకథ

కూర్పు, సంక్షిప్తీకరణ

**అట్లూరి మురళి**

అనువాదం

**తెలకపల్లి రవి**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*ఎమ్‌హెచ్ భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం*

*హైదరాబాద్ -20, ఫోన్ : 040 - 27660013*

ప్రచురణ సంఖ్య : 1303

ప్రథమ ముద్రణ : నవంబర్, 2013

వెల : ₹ 150

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27608107

బ్రాంచీలు

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,

హన్మకొండ, నల్గొండ, గుంటూరు, ఒంగోలు

ముద్రణ

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్

website : www.psbh.in



పుచ్చలపల్లి సుందరయ్య

# విషయసూచిక


పరిచయం ........................................ 7

ఉపోద్ఘాతం ........................................ 9

1. బాల్యం, కుటుంబం, మా ఊరు ........................ 13
2. వీధి బడిలో విద్యాభ్యాసం ........................ 17
3. మా ఊరు ........................................ 19
4. తిరువళ్ళూరులో చదువు ........................ 25
5. రాజమండ్రిలో రాజకీయ చైతన్యం ........................ 29
6. మద్రాసులో విద్యాభ్యాసం ........................ 35
7. సత్యాగ్రహిగా.. ........................................ 55
8. జైలు జీవితం ........................................ 63
9. మళ్లీ బెంగుళూరులో ........................................ 79
10. మళ్ళీ మా ఊరికి రాక, కార్యకలాపాలు ........................ 85
11. భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిక ........................ 105
12. ఆంధ్రలో కమ్యూనిస్టు పార్టీ స్థాపన ........................ 107
13. దత్ బ్రాడ్లీ థీసిస్ – జాతీయ ఐక్య సంఘటన ........................ 119
14. ఆంధ్ర ఉద్యమ పటిష్టతలో నా పాత్ర ........................ 143
15. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో కార్యకలాపాలు ........................ 151

16. లైలాతో నా వివాహం ........................................ 175
17. తెలంగాణా సాయుధ పోరాట ప్రారంభం ............................ 183
18. పోలీసు చర్య – పోరాటం కొనసాగింపు ............................ 197
19. అంతర్గత చర్చలు – రణదివె వాదనలు .. ............................ 203
20. మారిన పరిస్థితులపై వివరణ కోసం అడవిలో దళాల దగ్గరకు... ..... 215
21. 1952 ఎన్నికలు – సిపిఐ ఘన విజయాలు ............................ 225
22. తెలంగాణా పోరాటం – అనుభవాలు, గుణపాఠాలు .................. 229
23. రహస్య యంత్రాంగం – సహచరులు ....................................... 245
24. సాయుధ దళాలతో సమావేశం : పోరాట విరమణపై వివరణ ........ 259
25. పార్టీలో అంతర్గత చర్చలు – వివిధ సమస్యలపై విభేదాలు ............ 273
26. పార్టీ కేంద్రం, పార్లమెంటరీ రంగం ....................................... 279
27. 1955 ఆంధ్ర ఎన్నికలు – అనంతరం ....................................... 297
28. ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడుగా ............................................ 305
29. మార్క్సిస్టు పార్టీ ఆవిర్భావం ................................................ 317
30. ప్రభుత్వ నిర్బంధకాండ, సిపిఐ(ఎం)పై దుష్ప్రచారం .................. 345
31. మాస్కోలో చికిత్స................................................................. 353
32. 1967 ఎన్నికలు ................................................................ 365
33. నక్సలైట్ చీలిక ................................................................. 373
34. కార్యకర్తలతో సంబంధాలు కీలకం........................................ 389

# పరిచయం

**భా**రతదేశపు మహోన్నత పుత్రుల్లో అగ్రగణ్యుడు, తెలుగు తల్లి ముద్దుబిడ్డడు, కష్టజీవుల ప్రియతమ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య శత జయంతి సందర్భంగా ఆయన ఆత్మకథ సరికొత్త కూర్పు వెలువడుతున్నది. ఈ ఆత్మకథ పుస్తకం గతంలో వచ్చిన వాటి పునర్ముద్రణ కాదు. సరికొత్త సమగ్ర కూర్పు. ఈ సందర్భంగా దీని నేపథ్యం పాఠకులతో పంచుకోవలసి వుంది.

జీవిత సర్వస్వం ప్రజల కోసం ప్రజా ఉద్యమాల కోసం ధారవోయడమే తప్ప తన గురించి ఏనాడూ ఆలోచించని సుందరయ్య తన జీవిత కథ రాయాలని కూడా అనుకోలేదు. అనుభవాలు జ్ఞాపకాలు గ్రంథస్తం చేయాలని సహచరులు సూచించినా ఆసక్తి చూపించలేదు. ఒక దశలో వి.శ్రీహరి, డా.ఎ.పి.విఠల్ ఆయన సమకాలికులను కలుసుకుని ఒకటి రెండు ఇంటర్వ్యూలు చేశారు గాని తర్వాత అదీ ముందుకు సాగలేదు. ఈ లోగా సుందరయ్య గారి ఆరోగ్యం బాగా దెబ్బ తినడంతో సిపిఎం రాష్ట్ర నాయకత్వం తన జీవితానుభవాలు భావి తరాలకు అందించడం అవసరమని ఆయనపై బాగా వత్తిడి తెచ్చి ఒప్పించింది. ఇతరేతర పనిభారాన్ని తగ్గించుకొని దీనిపై కేంద్రీకరించాలని కోరింది. ఆయన చెప్పిన దాన్ని టేపు చేసే బాధ్యత డా.విఠల్‌కు అప్పగించింది. ఆయనే తర్వాత దాన్ని రెండు భాగాలుగా అనువదించారు. బహుభాషా ప్రావీణ్యం గల లీలా సుందరయ్య, ఆ కుటుంబానికి దీర్ఘకాల అనుచరుడు చారి, నాటి నవయుగ ఫిలింస్‌కు సంబంధించిన సూర్య ప్రకాశరావు ఎంతో శ్రమపడి టేపులను డీ కోడ్ చేసి అనువాదానికి సిద్ధపరిచారు.

1986 మే 19 సుందరయ్య గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రథమ భాగం అపూర్వమైన రీతిలో 16,000 ప్రతులు ముద్రిస్తే వెనువెంటనే చెల్లిపోయాయి. మళ్లీ ఏడాదికి 4 వేలు, తర్వాత మూడు సార్లు మూడు వేల ప్రతుల చొప్పున ప్రచురితమైంది. అలాగే ద్వితీయ భాగం 1988లో తృతీయ వర్ధంతి నాటికి 10 వేల ప్రతులతో ప్రథమ ముద్రణ వస్తే తర్వాత 3 వేల ప్రతుల చొప్పున మూడు ముద్రణలు

పొందింది. పాఠకుల సౌలభ్యం కోసం రెండు భాగాలు కలిపిన ముద్రణ 2009 నుంచి మూడేళ్లలో నాలుగు ముద్రణలు పొంది 8000 ప్రతులు వెలువడ్డాయి. తెలుగు పుస్తకాల చరిత్రలోనూ ప్రత్యేకించి ఆత్మకథల విషయంలోనూ ఇది పెద్ద రికార్డు. సుందరయ్య గారి పట్ల అశేష జనం అభిమానానికి కమ్యూనిస్టు శ్రేణుల గౌరవ భావానికి ఇదొక నిదర్శనం. పత్రికా సమీక్షలు మేధావుల స్పందనలు కూడా దాన్నే ప్రతిబింబించాయి.

ఆ పుస్తకాన్ని ప్రథమ వర్ధంతి నాటికి తీసుకురావాలన్న భావనతోనే రెండు భాగాలుగా విభజన జరిగింది. మోటూరు హనుమంతరావు గారు సూచించిన కొద్ది మార్పుల మేరకు దాని ముద్రణ జరిగింది. సుందరయ్య స్వయంగా చెప్పిన ఇంగ్లీషు కథనం పుస్తకంగా తీసుకురావాలని భావించిన నేషనల్ బుక్‌ట్రస్ట్ (ఎన్‌బిటి) చైర్మన్ బిపన్ చంద్ర కోరిక మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆ బాధ్యత స్వీకరించింది. కేంద్రం పక్షాన సఫ్దర్ అహ్మద్ ఇంగ్లీషు టేపులను డిటిపి చేయగా ప్రొ. అట్లూరి మురళి ఎడిట్ చేశారు. 2009లో విజ్ఞాన కేంద్రంలోనే ఆవిష్కరణ జరిగిన ఈ పుస్తకం అనతి కాలంలోనే మలి ముద్రణ పొంది, ఎన్‌బిటి ప్రచురణలలో ప్రముఖ స్థానం ఆక్రమించింది. దీని తెలుగు అనువాదం కూడా ఎన్‌బిటి త్వరలోనే తీసుకురానుంది. అయితే శతజయంతి సందర్భంలో ఎక్కువ మందికి పుస్తకం చేర్చడం బాధ్యతగా భావించిన విజ్ఞాన కేంద్రం ఈ ప్రచురణ తీసుకురావడం ఆనందదాయకం. గతంలో వచ్చిన అనువాదం ఇందుకు ఉపయోగపడింది. ఈ రెండు సందర్భాల్లోనూ ప్రచురణల్లో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

ఈ పుస్తకం నేరుగా ఇంగ్లీషు నుంచి ఏకమొత్తంగా అనువదించి ప్రచురించడం వల్ల గతంలో వచ్చిన తెలుగు ఆత్మకథకు దీనికి కొన్ని తేడాలు వుండొచ్చు. శత జయంతి సందర్భంలో సుందరయ్య భావాలు సూటిగా తెలియడానికి వీలుగా రాజకీయ కోణంలో ప్రత్యేకమైన ఎడిటింగ్ ఏదీ జరగలేదు. మౌలికాంశాలలో రెంటికీ తేడా వుండకపోయినా ప్రస్తుత ప్రచురణ ప్రామాణికంగానూ సమగ్రంగానూ పాఠకులకు సంతృప్తి కలిగిస్తుందనే భావిస్తున్నాం. ఇప్పటికే అరవై వేల ప్రతుల వరకూ అందించిన గత పుస్తకం స్థానే ఇకపై దీన్ని పునర్ముద్రణ కొనసాగుతుంది. సుందరయ్య విప్లవ వారసత్వాన్ని జీవితాదర్శాలను బహుధా వ్యాపింపచేయడానికి ఆయన ఆత్మకథ కొత్త కూర్పు దోహదపడగలదని విశ్వసించవచ్చు.

**ఆ ప్రజల మనిషికి నూరేళ్ల నివాళి**

**- తెలకపల్లి రవి**

# ఉపోద్ఘాతం

పుచ్చలపల్లి సుందరయ్య 1913 మే 1వ తేదీన నెల్లూరుజిల్లా అలగాని పాడులో ఒక ధనిక రైతు కుటుంబంలో పుట్టారు. యువకుడుగా వున్నప్పుడు ఆయనపై కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావు వంటి అనేక మంది సంఘ సంస్కర్తల ప్రభావం పడింది. మహాత్మాగాంధీ నుంచి ఉత్తేజం పొందిన సుందరయ్య తన 14 వ ఏట మద్రాసు రాష్ట్రంలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు హాజరైనాడు. సైమన్ గో బ్యాక్ ఆందోళనలో పాల్గొన్నాడు. మద్రాసులోని లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్ చదివేప్పుడు ఇతర విద్యార్థులతో కలసి దేశ భక్తిని పెంపొందించే లక్ష్యంతో సోదర సమితి స్థాపించాడు. రాజకీయాలను అర్థం చేసుకోవడం, ఆదివారాల్లో ఖద్దరు అమ్మడం, వ్యాయామాలు, సామాజిక దురాచారాల నిర్మూలన,సెలవు రోజుల్లో గ్రామాల్లో వ్యవసాయ కార్మికులకు చదువు చెప్పడం వంటి లక్ష్యాలతో పనిచేశారు.ఒక రోజున వేమన మహాకవి జయంతి సందర్భంగా సుందరయ్య గ్రామంలో దళితులతో కలసి సహపంక్తి భోజనం ఏర్పాటు చేశాడు. ఇందుకు వ్యతిరేకంగా ధనిక రైతులు, ఛాందసులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఫలితంగా సుందరయ్య రెండు రోజులు నిరాహార దీక్ష చేశాడు.

1930లో మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుకు స్పందించి ఆయన చదువుకు స్వస్తి చెప్పి స్వాతంత్ర పోరాటంలో చేరాడు. ఈ మేరకు తన తల్లికి, అన్నయ్యకు లేఖ రాసిపెట్టి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఒక సత్యాగ్రహ శిబిరంలో చేరాడు. రెండేళ్ళు జైలు శిక్ష అనుభవించాడు. విడుదలైన తర్వాత సుందరయ్య గ్రామాల్లో పని చేయడం మొదలు పెట్టాడు. వ్యవసాయ కార్మికులను సంఘంలో సమీకరించాడు. అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడాడు. వలస పాలనను అంతమొందించినంత మాత్రాన

స్వాతంత్రం రాదని వర్గ దోపిడీని, దారిద్ర్యాన్ని సమాజం నుంచి పారదోలిన నాడే స్వాతంత్రం సిద్ధిస్తుందని ఆయన గట్టిగా విశ్వసించాడు.

కామ్రేడ్ అమీర్ హైదర్‌ఖాన్ మార్గదర్శకత్వంలో సుందరయ్య కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. ఆ సమయంలో పార్టీపై బ్రిటిష్ వారు నిషేధం విధించారు. అయినా దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తమిళనాడు,కేరళ, కర్ణాటకలలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించే కర్తవ్యం తనపై వేసుకున్నాడు. ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్, పి.కృష్ణపిళ్లై, ఎ.కె.గోపాలన్ తదితర హేమాహేమీలు పార్టీలోకి రావడానికి ఎస్.వి.ఘాటేతో పాటు ఆయనే కారకుడు. వివిధ కమ్యూనిస్టు గ్రూపులు లీనమై 1936లో ఒక అఖిల భారత కేంద్రం ఏర్పాటు చేసుకున్నప్పుడు సుందరయ్య కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు. అదే ఏడు ఆయన అఖిల భారత కిసాన్ సభ స్థాపించి చాలా కాలం పాటు దాని సహాయ కార్యదర్శిగా పనిచేశాడు.ఇచ్ఛాపురం నుంచి మద్రాసు వరకూ 1500 మైళ్ల దూరం రైతు రక్షణ యాత్ర జరిపి 1500 గ్రామాలలో రైతుల చైతన్యం పెంచేందుకు కృషి చేశాడు. పోలీసులు వేటాడుతున్న కారణంగా 1939-42 మధ్య సుందరయ్య అజ్ఞాత జీవితం గడిపాడు.1943లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగిన తర్వాత బొంబాయిలో జరిగిన తొలి మహాసభలో ఆయన కేంద్ర కమిటీకి ఎన్నికైనాడు. అప్పటి నుంచి మరణించే వరకూ ఆయన మొదట సిపిఐలో తర్వాత సిపిఐ(ఎం) లో వివిధ బాధ్యతలలో సేవలు చేశాడు.

అదే ఏడాది అంటే 1943 ఫిబ్రవరి 27న సుందరయ్య లీలను పెళ్ళి చేసుకున్నాడు. అప్పటి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పి.సి.జోషి దగ్గరకు వెళ్లి మేము భార్యాభర్తలుగా జీవితం గడపదలుచుకున్నామని సూటిగా చెప్పేశారు. లీల కూడా పార్టీలో హోల్‌టైమర్‌గా మారింది. పెళ్ళయిన రెండు మాసాల తర్వాత సుందరయ్య వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాడు. దానికన్నా ముందు భార్యా భర్తలిద్దరూ ఈ సమస్య చర్చించుకుని పిల్లలను సక్రమంగా పెంచే అవకాశం వుండదు గనక సంతానం వద్దని నిర్ణయానికి వచ్చారు. అయితే పిల్లలను కనాలా వద్దా అనే విషయంలో భార్యదే నిర్ణయంగా వుండాలని సుందరయ్య అభిప్రాయపడ్డాడు.పార్టీ కార్యకర్తలు పెళ్ళి చేసుకుని పరిమిత సంతానాన్ని కనాలని ఆయన సలహా ఇస్తుండేవాడు.

ప్రజా పోరాటాలకు సుందరయ్య చేసిన సేవలు విస్తారమైనవి. కుటుంబ ఆస్తిలో తన వాటాను అమ్మివేసి ఆ డబ్బును ఆయన ప్రజా ఉద్యమాల నిర్మాణానికి వెచ్చించాడు.

విశాలమైన ఆశయాల కోసం నిరంతరాయంగా పోరాడిన సుందరయ్య యువ తరానికి కంచుకాగడాగా మారాడు. సుందరయ్య కేవలం సంస్కర్తగానే గాక శాస్త్రీయమైన విశ్లేషణ, అవగాహనలతో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే ప్రసిద్ధ పుస్తకం రాశాడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కోసం జరిగిన పోరాటంలో అదొక మైలు రాయి.

కమ్యూనిస్టుపార్టీ పిలుపుపై సుందరయ్య వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం అందించారు. వేలాది మంది యోధులు ప్రాణాలర్పించిన ఆ పోరాటం నిజాం రాచరిక రాజ్యాన్ని కుప్పకూల్చి వేసింది. ఈ పోరాట నిర్వహణలో లభించిన సుసంపన్నమైన అనుభవంతోనే సుందరయ్య మరో చారిత్రాత్మక గ్రంథం వీర తెలంగాణా విప్లవ పోరాటం గుణపాఠాలు రాశాడు.

1952 సాధారణ ఎన్నికల తర్వాత సుందరయ్య మద్రాసు అసెంబ్లీ నుంచి రాజ్యసభకు ఎన్నికైనాడు. పార్లమెంటులో కమ్యూనిస్టు గ్రూపు నాయకుడైనాడు. రాష్ట్రంలో క్రియాశీల ఎన్నికల రంగంలో దూకి 1955 నుంచి 1967 వరకూ తిరిగి 1978 నుంచి 1983 వరకూ రాష్ట్ర శాసనసభ సభ్యుడుగా వున్నాడు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నాయకుడుగా ఆయన రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన అనేక కార్యక్రమాలు పథకాలకు రూపు రేఖలిచ్చారు. పార్లమెంటులోనూ అసెంబ్లీలోనూ కూడా ఆయన వాస్తవాలు సంఖ్యా వివరాలతో కూడిన పదునైన ప్రసంగాలు చేశాడు. నిశిత విమర్శలు, నిర్మాణాత్మక సూచనలు అందించి సభా కార్యక్రమాల నాణ్యతనూ సారాన్ని ఇనుమడింపచేశాడు. సుందరయ్య ఎంత నిరాడంబరుడుంటే పార్లమెంటుకు అసెంబ్లీకి సైకిల్‌పై వెళుతుండేవాడు! 1985 మే 19న కన్నుమూసే వరకూ ఆయన ప్రజలను దారిద్ర్యం నుంచి వర్గ పీడన నుంచి విముక్తి చేసేందుకు పోరాడుతూనే వున్నాడు. నిష్కళంక దేశ భక్తుడుగా నిస్వార్థ స్వాతంత్ర యోధుడుగా, మహత్తర కమ్యూనిస్టు విప్లవ కారుడుగా పీడిత ప్రజల ప్రియతమ నాయకుడుగా నిలిచాడు.

**తన ఆత్మకథలో ఒక చోట సుందరయ్య ఇలా అంటాడు**

“నాయకులు కదిలితే చాలదు. ప్రజలు కదలాలి.... అలాగే మన కార్యకర్తల విజ్ఞాన స్థాయి అనేక రెట్లు పెరగాలి. కనక కొద్దిమంది విప్లవం తీసుకురాగలరనో, కొన్ని పార్లమెంటరీ విజయాలతో లక్ష్యం చేరువవుతుందనో భావించడం దగ్గర దోవలు వెతకడం చాలా తప్పు. ప్రజలలో చైతన్యం కూడా మొత్తంగానే పెరగాల్సి వుంటుంది. దానికి మనం నిరంతరం కృషి సాగించాలి.”

సుందరయ్య మహోజ్వల జీవితానుభవాలను నిక్షిప్తం చేయడానికి ఎ.పి.విఠల్, వి.శ్రీహరి ఆయన జీవిత విశేషాలను ఆయన గొంతులోనే రికార్డు చేయగలిగారు. ఒక్కొక్కటి 90 నిముషాల చొప్పున గల 20 టేపులలో వున్న ఆత్మకథనం సుందరయ్య జీవితాన్ని సవివరంగా చిత్రిస్తుంది. ఆ కథనంలో ఎక్కువ భాగం ఇంగ్లీషులో వుంది. మధ్య మధ్య కాస్త తెలుగు వుంటుంది. ఈ టేపుల ఆధారంగా కథనాన్ని తయారు చేసిన వారు సఫ్దర్ అహ్మద్, టి.వెంకటాచారి. ఈ ఆత్మకథ ప్రతిని తయారు చేసే మొత్తం కార్యక్రమం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి సి.సాంబిరెడ్డి, ఆయన సహాయకుడు ఐ.నరసయ్యల పర్యవేక్షణలో జరిగింది.

నేను ఈ రాతప్రతిని వ్యక్తిగతంగా చదివి, కూర్పు క్లుప్తీకరణ చేసి ఒక పఠనీయ పుస్తకం పరిణామానికి దాన్ని తీసుకొచ్చాను. అదే సమయంలో ఒక ఆత్మకథలో వుండాల్సిన లక్షణాలేవీ దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నాను. ఈ ఆత్మకథ రూపకల్పనకు సహాయపడిన వారందరికీ సుందరయ్య విజ్ఞాన కేంద్రం ధన్యవాదాలు తెల్పుతున్నది. ప్రత్యేకించి ఈ రాతప్రతిని నేషనల్ బుక్‌ట్రస్టు ప్రచురణ కోసం సమర్పించవలసిందిగా ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ వచ్చిన ప్రొఫెసర్ బిపన్‌చంద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు

**అట్లూరి మురళి**

**హైదరాబాదు**

**ఫిబ్రవరి 2009**

# 1

# బాల్యం, కుటుంబం, మా ఊరు

నెల్లూరు జిల్లా కొవ్వూరు తాలూకాలో అలగానిపాడు ఒక పల్లెటూరు. ఆ గ్రామంలో ఒక భూస్వామి కుటుంబంలో 1913 మే 1 వ తేదీన నేను పుట్టాను. మా నాయన పుచ్చలపల్లి వెంకట్రామిరెడ్డి. అమ్మ పేరు శేషమ్మ. మా నాయనకు 50 ఎకరాల వరకు భూమి ఉంది. ఆయనకు ఆ ప్రాంతమంతటా చాలా పలుకుబడి ఉండేది. నేను మా కుటుంబంలో ఆరవవాడిని. అందరికి కన్నా పెద్ద మా అన్న. ఆ తర్వాత వరుసగా నలుగురు అక్కలు, ఆ తర్వాత నేను పుట్టాను. రెండవ మగపిల్లవాడిని గనుక నన్ను అమిత గారాబంగా చూసుకునేవారు. మా చిన్నక్కకు నాకు 16 నెలల తేడా కూడా లేదు. మాములుగా ఆ రోజులలో అంతమంది అమ్మాయిల తర్వాత అబ్బాయి పుట్టడం శుభసూచకంగా భావించేవారు. నా తర్వాత పుట్టిన మా తమ్ముడు డాక్టర్ రామచంద్రారెడ్డిగా ఆయన అందరికి తెలిసినవాడే.

అలగానిపాడు సామాజిక ఆర్థిక పరిస్థితుల గురించి చెప్పాలంటే అది పెన్నా డెల్టాలో ఉంటుంది. కనిగిరి రిజర్వాయరు తూర్పు కాలువ చివర మాది. మాగాణి ఒక పంటకు నీరు గ్యారంటీ ఉండేది. మొదట్లో గ్రామంలో మాదే పెద్ద భూస్వామి కుటుంబమని మా అమ్మ మేము పెద్దవాళ్లమవుతున్న దశలో చెబుతుండేది. మా నాయనవాళ్ళు నలుగురు అన్నదమ్ములు, మా నాయన మూడవవాడు. తనకు ఇద్దరు అన్నలు ఒక తమ్ముడు వుండేవారు. ఆ ప్రాంతంలో అతి పెద్ద భూస్వామి కుటుంబాల్లో మాదొకటి. గ్రామంలో చాలా భాగం ఉమ్మడి భూమిగా వారికింద ఉండేది. మా తాత హయాంలో ఆ ఊళ్ళో చాలా భూమి మాదే. అయితే అంత భూమిని సేద్యం చేయడం కష్టమయ్యేది. అందుకని చాలా భూమిని వదిలించుకున్నారు. ఇందుకోసం ఏం చేస్తారన్నది

చాలా తేలికైన విషయమే. మేము పన్నుకడుతున్న ఇంత భూమి సాగు చేసుకోలేము ఈ భూమిలో కొంత భాగం వదులుకొంటాము అని ప్రభుత్వానికి రాస్తే చాలు. ఆ విధంగా చేయడం ద్వారా భూమి శిస్తు వ్యవసాయ సెస్సు చెల్లించే భారం తగ్గించుకునేవారు.

నేను పెరుగుతున్న కొద్దీ తెలిసిందేమంటే ఉమ్మడి భూమిలో వ్యవసాయ కార్మికులకు కొంత వాటా వుండేది. ఇది నాగలి, ఎద్దులు,బళ్లు ఇతర వ్యవసాయ పనిముట్లు రూపంలో వుండేది. అప్పట్లో నేను ఈ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. అవన్నీ మా ఉమ్మడి భూములని మా అమ్మ చెప్పింది మాత్రమే విన్నాను. కాని ఆ తర్వాత దశలో సమాజాన్ని గూర్చిన అవగాహన పెరుగుతున్న కొద్దీ ఈ అంశాల ప్రాధాన్యత బోధపడింది. సమాజ పరిణామ క్రమంలో ముఖ్యంగా గ్రామీణ పరిస్థితులలో వాటి ప్రాధాన్యత తెలుసుకున్నాను. మా కుటుంబం విషయానికి వస్తే మా అమ్మ మా నాయనకు రెండో భార్య. ఆయన మొదటి భార్య పిల్లలు కలగకుండానే చనిపోతే మా అమ్మను చేసుకోవలసి వచ్చింది. ఆమె ఆయన కన్నా చాలా చిన్నది. 16 ఏళ్ళు వుంటే వుండొచ్చు. 1919 మార్చిలో శివరాత్రి ముందురోజు మా నాయన చనిపోయాడు. అప్పటికి మా పెద్దన్నకు 16 సంవత్సరాలు. నాకు ఆరేళ్ళు వుండొచ్చు. మా తమ్ముడు రామచంద్రారెడ్డి తర్వాత ఒక అబ్బాయి పుట్టాడు. కానీ చనిపోయి పుట్టాడు. 1950లో నేను తెలంగాణా పోరాటంలో అజ్ఞాతవాసంలో ఉండగా మా అమ్మ చనిపోయింది. నాకు బాగా గుర్తున్న చిన్నప్పటి విషయాలు గ్రామంలో రోజువారీ జీవితంలో చూసే తగాదాలకు సంబంధించినవే. మా నాయనను గూర్చి ఇంతకుముందే చెప్పినట్లు వాళ్ళు నలుగురు అన్నదమ్ములు. అందరికీ వేర్వేరు ఇళ్ళు వుండేవి. అన్ని పెంకుటిళ్ళే. గ్రామం మధ్యలో పెద్ద ఆవరణలో అవి వుండేవి. వాళ్ళ మధ్య ఇళ్ళు, ఆస్తుల పంపకాల సందర్భంలో గొడవలుండేవి. నాకు బాగా గుర్తున్న సంగతి ఏమంటే మా నాన్న అప్పటికే బాగా ముసలివాడైపోయాడు. 1915-16 మధ్య ఎప్పుడో ఒక రోజు జరిగిన ఘటన అది. మా నాయన ఇంటి ముందు అరుగుపై కూర్చున్నాడు. పెద్దగ అరుచుకుంటూ కుర్రాళ్లుగా వున్న మా చిన్నాన్న కొడుకులు వేడివేడిగా వాదులాట జరిగాక ఆయనను కొట్టేందుకు వచ్చారు. మా నాయన కోపంతో పక్కనే వున్న "వసికట్ట" ఒకటి తీసుకుని ఎదుర్కొన్నాడు. తీవ్రమైన గొడవ జరిగింది గాని కొద్ది నిముషాల్లోనే సర్దుకుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sundaraiah+Atmakatha**

* * *